E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 16-02-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:46 || పేజీలు–6 www.ekaburu.com



అందుకు ఓకే అయితే..
న్యూక్లియర్ డీల్‌కు రెడీ: ఇరాన్

» 2లో

## సర్వం శివోహం



ఈ కబురు ; మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం తెల్లవారు జాము నుంచి శైవక్షేత్రాల్లో పూజలు మొదలయ్యాయి. పర్వదినం కావడంతో శివయ్య దర్శనానికి భక్తులు వేలాదిగా తరలి రావడంతో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తుల శివనామ స్మరణతో మారుమ్రోగాయి.

## మేం పాలకులం కాదు.. సేవకులం

- తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న ముఖ్యమంత్రి
- గెలుపు, ఓటములకు బాధ్యత తీసుకుంటాననే అలా చెప్పానని వెల్లడి
- తానెప్పుడూ పాలకుడిగా ప్రవర్తించలేదన్న రేవంత్ రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్: తాము పాలకులం కాదు.. సేవకులమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు సేవ చేయడానికి తమకు అవకాశమిచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి తండాలోని పాఠశాల భవనాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తండాలకు సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ప్రభుత్వం వద్ద భూములు లేవని.. సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. చదువుతో కీలక పదవులు వస్తాయన్నారు. "నేనెప్పుడూ పాలకుడిగా ప్రవర్తించలేదు. ఎస్సీ వర్గీకరణ చేసి ఆయా వర్గాలకు మేలు చేశాం. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన నాది. రాష్ట్రంలో ఎస్సీలు 17 శాతం ఉంటే.. మా ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారు. దళితులకు స్పీకర్, మంత్రి పదవులు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలను వక్రీకరించారు. పురపాలక మంత్రిని కూడా నేనే కాబట్టి గెలుపు.. ఓటమి.. అన్నింటికీ బాధ్యత తీసుకుంటానని చెప్పా. ఈ ఎన్నికల్లో ప్రతి ఫలితం నా పనితనానికి గీటురాయి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.

తరువాయి 2లో



### 2

రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!
..ట్రేడ్ డీల్‌పై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు

ఈ కబురు : అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు.



### 2

కరీంనగర్ కార్పొరేషన్‌ను
దక్కించుకుంటాం: మంత్రి పొన్నం

ఈ కబురు, వేములవాడ: కరీంనగర్ మేయర్ పీఠంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్పొరేషన్‌ను దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వేములవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. "నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి



### 2

చంద్రబాబుకు టచ్ లోకి
తెలంగాణ నేతలు?

ఈ కబురు ; తెలంగాణ గడ్డ పై పుట్టిన పార్టీ.. లక్షల్లో కరుడు గట్టిన కార్యకర్తలు ఉన్నా.. పార్టీ అధినాయకత్వం కారణాలు ఏమైనా వేచి చూసే ధోరణి అవలంభిస్తుండడం తో క్యాడర్ లో నైరాస్యం అలుముకుంటుంది.

## సామాన్యుల కోసమే 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ప్రధాని మోదీ



ఈ కబురు : గడిచిన దశాబ్ద కాలంగా రక్షణ రంగంలో తీసుకువస్తున్న సంస్కరణల ప్రయోజనాలు ఆపరేషన్ సిందూర్ సమయంలో స్పష్టంగా కనిపించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ ఎప్పుడూ సంసిద్ధతతో ఉండాలన్న ఆయన.. రక్షణ రంగాన్ని ఆధునికీకరించడంతోపాటు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన మోదీ..

....(3లో)

## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం

- కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- 34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు
- కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు



ఈ కబురు ; రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ

తరువాయి 2లో

## శిబిరాల్లో కౌన్సిలర్లు.. వ్యూహాల్లో నేతలు

కాంగ్రెస్, భారాస లోపాయికారి ఒప్పందాలు

ఈ కబురు, జగిత్యాల ; జిల్లాలో పలు పురపాలక చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక రసవత్తరంగా మారింది. జగిత్యాలలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుంది. మెట్‌పల్లి, రాయికల్‌లలో భాజపా పెద్ద పార్టీగా నిలిచినా ఆధిక్యం లేకపోవడంతో పొత్తులపై చర్చలు నడుస్తున్నాయి

....(3లో)



## జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ
.. రంగంలోకి సీనియర్ నేతలు

ఈ కబురు, హైదరాబాద్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి



....(3లో)

## నేడు అమరావతికి బిల్ గేట్స్

- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి
- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం



**ఈ కబురు :**

మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నేడు ఆయన తన బృందంతో ఏపీ లో పర్యటించనున్నారు. తన గేట్స్ ఫౌండేషన్ తరపున రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులను సందర్శించడంతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు తో భేటి కానున్నారు. బిల్ గేట్స్ పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంజీవిని పథకం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆ ప్రాజెక్టును సైతం బిల్ గేట్స్ పరిశీలించనున్నారు. బిల్ గేట్స్ తో పాటు ఆయన ప్రతినిధి బృందం కూడా రానుంది. ఈ పర్యటనలో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో భేటీ కానున్నారు.

తరువాయి 2లో

## చదివింది బీఏ.. చేసేవి శస్త్ర చికిత్సలు



ఈ కబురు : ఓ నకిలీ వైద్యుడి నిర్వాకం వల్ల గర్భిణి మృతిచెందిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్‌లోని బస్థారి ప్రాంతంలో యోగేష్ వర్మ అనే సర్జన్ కొన్నేళ్లుగా క్లినిక్‌ను నడుపుతున్నారు.

....(2లో)

## పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్

- టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం
- 61 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించిన టీమిండియా
- భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్ (77)
- వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్.. సూపర్-8లోకి ప్రవేశం
- భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్



....(6లో)

## సైన్యానికి బదులు పొట్టను పెంచుతున్నారు
.. హంగరీ పీఎంపై జెలెన్‌స్కీ

ఈ కబురు : రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనుకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.



తరువాయి 2లో

## పరిగి మున్సిపల్ పీఠంపై ఉత్కంఠ
.. ఎక్స్‌అఫీషియో ఓటే కీలకం!

ఈ కబురు, పరిగి: వికారాబాద్ జిల్లా పరిగిలో రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. మున్సిపల్ పీఠం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ శాయశక్తులా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. పరిగి మున్సిపాలిటీలో మొత్తం 18 స్థానాలుండగా.

....(3లో)

తారిఖ్ ప్రమాణ స్వీకారానికి..
## భారత్ తరపున ఓం బిర్లా



ఈ కబురు, ఢిల్లీ: బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. విదేశాంగశాఖ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

....(2లో)

ఈ-కబురు

16- 02 -2026
సోమవారం
e-kaburu.com

# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్



భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు. గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ

# నేడు అమరావతి కి బిల్ గేట్స్



ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.

-- సన్నిహిత సంబంధాలు..

బిల్ గేట్స్ తో చంద్రబాబుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బిల్ గేట్స్ ను కలిసేందుకు సమయం కోరారు. అయితే అతి కొద్ది సమయం మాత్రమే ఇచ్చారు బిల్ గేట్స్. అప్పట్లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి గేట్స్ ను మెప్పించారు చంద్రబాబు. హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ ఏర్పాటులో ముందడుగు పడింది అప్పుడే. మైక్రోసాఫ్ట్ ఏర్పాటు అయిన తర్వాత దిగజా ఐటీ సంస్థలన్నీ హైదరాబాద్ వచ్చాయి. సాఫ్ట్వేర్ రంగం అభివృద్ధి చెందింది. చంద్రబాబుకు మంచి పేరు కూడా వచ్చింది. అయితే ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టేందుకు బిల్ గేట్స్ ముందుకు రావడం శుభ పరిణామం. బిల్ గేట్స్ అమరావతి పర్యటనతో అనేక కీలక అంశాలు వెలుగులోకి రానున్నాయి. పెట్టుబడులకు సంబంధించి ఫుల్ క్లారిటీ రానుంది.

-- షెడ్యూల్ ఇది..

బిల్ గేట్స్ బృందం నేటి ఉదయం పది గంటలకు అమరావతి లోని రాష్ట్ర సచివాలయానికి రానుంది. అక్కడి ఆర్ టి జి ఎస్ కేంద్రానికి వెళ్లి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించనున్నారు. రియల్ టైం గవర్నెన్స్ విధానాలు, ఫలితాలను బిల్ గేట్స్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించుతున్నారు. అనంతరం బిల్ గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల అధికారులు సమావేశం అవుతారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యా తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణల పై సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్ ఇస్తారు. మెడ్ టెక్, దయాగ్నస్టిక్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టుల గురించి సీఎం చంద్రబాబు గేట్స్ వివరిస్తారు. మరోవైపు అమరావతి లోని ఉండవల్లి గ్రామం వద్ద ఓ వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళనున్నారు గేట్స్. అక్కడ డ్రోన్లు,, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో వచ్చే పట్టే సాగు విధానాన్ని పరిశీలించనున్నారు.

## రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!
## ..ట్రేడ్ డీల్‌పై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు



ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిందన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కి ఐదు ప్రశ్నలు సంధించారు. డీడీజీ (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసిన (GM) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని రాహుల్ పేర్కొన్నారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

## అందుకు ఓకే అయితే..
## న్యూక్లియర్ డీల్‌కు రెడీ: ఇరాన్



ఈ కబురు ; అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యూఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా (USA) కోర్టులోనే ఉందని వ్యాఖ్యానించారు. 'ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ఇరాన్ ఒప్పందానికి రాకపోతే.. సైనిక చర్యలకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టెహ్రాన్ ప్రకటన కీలకంగా మారింది. అణు కార్యక్రమానికి సంబంధించి ఇరుదేశాల మధ్య ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఇవి సానుకూలంగా జరిగాయని మాజిద్ పేర్కొన్నారు. త్వరలోనే రెండో రౌండ్ చర్చలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

## సైన్యానికి బదులు పొట్టను పెంచుతున్నారు
## ..హంగరీ పీఎంపై జెలెన్‌స్కీ



పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఈయూ దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతే కాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండో విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

## చదివింది బీఏ..
## చేసేవి శస్త్ర చికిత్సలు



స్థానికంగా ఉండే ఓ గర్భిణి ఫిబ్రవరి 5న ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరింది. సిజేరియన్ సెక్షన్ ఆపరేషన్ అనంతరం తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. వైద్యుడిగా చలామణి అవుతున్న యోగేష్ వర్మకు వైద్య అర్హతలు లేవని దర్యాప్తులో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. యోగేష్ బీఏ చదివాడని.. వైద్య వృత్తిలో ఎటువంటి అనుభవం లేదని పోలీసులు తెలిపారు. అతడు ఎక్కడా ప్రత్యేక వైద్య శిక్షణ కూడా తీసుకోలేదన్నారు. ఆరోగ్య అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సిజేరియన్‌తో సహా ఇతర శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారన్నారు. వెంటనే క్లినిక్‌ను సీజ్ చేసి.. యోగేష్‌ను, అతడి సహాయకుడిని అరెస్ట్ చేశామన్నారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## మేం పాలకులం కాదు..
## సేవకులం: సీఎం రేవంత్



**--'నేనే రాజు నేనే మంత్రి' అని ఎందుకు అన్నానంటే..!: రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

'నేనే రాజు నేనే మంత్రి' అంటూ తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విపక్ష నాయకులు విమర్శలు గుప్పించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఇటీవల విలేకరులతో పిచ్చాపాటిగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'నేనే రాజు నేనే మంత్రి' అని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తదితరులు విమర్శలు గుప్పించారు. దీంతో రేవంత్ రెడ్డి తాజాగా ఆ వ్యాఖ్యలపై స్పష్టతను ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆయన అన్నారు. గెలుపు, ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటాననే ఉద్దేశంలో చెప్పానని ఆయన వెల్లడించారు. కానీ దానిని మరోలా అర్థం చేసుకున్నారని తెలిపారు.

## చంద్రబాబుకు టచ్ లోకి
## తెలంగాణ నేతలు?



ఈ దశలో పార్టీ మళ్ళీ యాక్టివ్ కానుందనే వార్తలు వస్తుండడం తో తెలంగాణ తెలుగుదేశం నాయకుల్లో ముఖ్యంగా కార్యకర్తలలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈమధ్య పలువురు నేతలు అధినేత చంద్రబాబు ను కలుస్తుండడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తుంది. తెలంగాణలో టిడిపి యాక్టివ్ కానుందా? బిఆర్ఎస్ నేతలు చంద్రబాబుకు టచ్ లోకి వచ్చారా? పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. గులాబీ పార్టీకి వరుసగా దెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీలో ఉన్న ఒకప్పటి టిడిపి నేతలు ఆందోళనతో ఉన్నారు. పార్టీకి భవిష్యత్తు ఉంటుందా లేదా అని బెంగ వారిని వెంటాడుతోంది. ఈ తరుణంలో మళ్లీ టిడిపిని యాక్టివ్ చేస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వారు వచ్చినట్లు తెలుస్తోంది. చంద్రబాబు ఒప్పుకుంటే తిరిగి టిడిపిని తెలంగాణలో బలోపేతం చేసే బాధ్యత తమది అంటూ కొందరు ముందుకు వస్తున్నట్లు టాక్ నడుస్తోంది. చంద్రబాబుతో వరుసగా చాలామంది నేతలు సమావేశం అవుతూ వస్తున్నారట. అయితే ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. మరోవైపు కేసీఆర్ వైఖరి కూడా మారుతోంది. వీటన్నింటినీ ప్రతికూలతలుగా భావిస్తున్న ఒక్కప్పటి టిడిపి నేతలు మాతృ పార్టీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.

--టిడిపి పై ఉక్కు పాదం..

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా నాశనం అయితేనే గులాబీ పార్టీ బలపడుతుందని కెసిఆర్ భావించారు. ఉద్యమ పార్టీగా ఉన్నంతవరకు తెలంగాణ అమరవీరులతో పార్టీని నడిపించారు. అప్పట్లో పరిమిత సంఖ్యలో మాత్రమే నేతలు ఉండేవారు. ఎప్పుడైతే బంగారు తెలంగాణ అన్న నినాదాలు బయటకు తెచ్చారు అప్పటినుంచి టిడిపిని తొక్కడం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ కీలక నేతలంతా కేసిఆర్ గొడుగు కిందకు. అయితే దాదాపు 9 సంవత్సరాల పాటు కెసిఆర్ హవా నడిచింది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 సార్వత్రిక ఎన్నికల్లో గులాబీ పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. ఒకవైపు అధికారి కాంగ్రెస్ పార్టీ దూకుడు.. ఇంకోవైపు భారతీయ జనతా పార్టీ బలం ముందు బిఆర్ఎస్ తేలిపోతోంది. ఆ పార్టీ ఇక పుంజుకోవడం కష్టమని.. కొత్త ముఖంతో వెళ్లడం ఉత్తమమని భావించి.. ఒకప్పటి టిడిపి నేతలు అంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి బలమైన కేడర్ ఉంది. నడిపించే నాయకత్వం లేక.. ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకపోవడంతో క్యాడర్ స్తబ్దుగా ఉండిపోయింది.

**--టిడిపి వైపు చూపు..**

తెలంగాణలో ఎన్నికలు వస్తున్న ప్రతిసారి తెలుగు దేశం పార్టీ వైపు అన్ని రాజకీయ పార్టీలు చూస్తున్నాయి. టిడిపి మద్దతు దొరికితే విజయం తప్పకుండా దొరుకుతుందన్న ఆశ ఆ పార్టీల్లో ఉంది. అయితే బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి తారుమారు కావడంతో.. అందులో ఉన్న ఒక్కప్పటి టిడిపి నేతలు పునరాలోచనలో పడ్డారు. వారంతా చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన సమ్మతిస్తే తెలంగాణలో టిడిపి బలోపేతానికి తాము కృషి చేస్తామని వారు ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా తెలంగాణలో ఉన్న ఒకప్పటి టిడిపి నేతలు అమరావతికి వచ్చి కలిసి వెళ్తున్నట్లు సమాచారం. మరి ఈ ప్రచారంలో నిజం ఎంత? చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అన్నది తెలియాల్సి ఉంది.

## కరీంనగర్ కార్పొరేషన్‌ను
## దక్కించుకుంటాం: మంత్రి పొన్నం



తప్పుకొంటున్నట్లు భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు. పూర్తి మెజార్టీ లేకపోవడంతోనే ఆ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో మెజార్టీ లేకున్నా మేయర్ పీఠం దక్కించుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎలా చెబుతారు? కార్పొరేషన్లలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్‌ను ఎన్నుకుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున అభివృద్ధికి సహకరిస్తాం. అందరినీ కలుపుకొని మేయర్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం. భాజపా ఎలాంటి ప్రయత్నాలు చేస్తుందో మేం కూడా అలానే చేస్తాం. మేయర్, ఛైర్‌పర్సన్ పీఠాల కోసం క్యాంపు రాజకీయాలు ఉంటాయి'' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## తారిఖ్ ప్రమాణ స్వీకారానికి..
## భారత్ తరఫున ఓం బిర్లా



ఫిబ్రవరి 17న జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు వెల్లడించింది. అయితే ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ భారత పర్యటకు వస్తుండడంతో మోదీ ఢాకాకు వెళ్లే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ నేతృత్వంలోని బీఎన్‌పీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 17న ఆయన ఢాకాలో కొత్త ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, శ్రీలంక, నేపాల్, భారత్ సహా 13 దేశాలకు ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.

# శిబిరాల్లో కౌన్సిలర్లు.. వ్యూహాల్లో నేతలు

ఈ కబురు, జగిత్యాల :

**జిల్లాలో పలు పురపాలక ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక రసవత్తరంగా మారింది. జగిత్యాలలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుంది. మెట్‌పల్లి, రాయికల్‌లలో భాజపా పెద్ద పార్టీగా నిలిచినా ఆధిక్యం లేకపోవడంతో పొత్తులపై చర్చలు నడుస్తున్నాయి. దాదాపు అన్ని పార్టీల కౌన్సిలర్లు శిబిరాలకు వెళ్లగా ఎమ్మెల్యేలు, నేతలు వ్యూహాల్లో నిమగ్నమయ్యారు.**

--జగిత్యాల జగడం కొలిక్కి!

జగిత్యాల కాంగ్రెస్‌లో వర్గాల నేపథ్యంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ రంగంలోకి దిగారు. ఆయన ఆదివారం ఉదయం మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో మాట్లాడటంతో వర్గీయులతో కలిసి శిబిరానికి వెళ్లారు. మంత్రి సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శిబిరానికి వెళ్లారు. సోమవారం ఉదయం జీవన్‌రెడ్డి శిబిరంలోని సభ్యులతో ఆయన మాట్లాడనున్నారు. పట్టణంలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 23 మందిలో ఎమ్మెల్యే వర్గీయులు 14 మంది, జీవన్‌రెడ్డి వర్గీయులు 9 మంది. 15 మంది స్వతంత్రుల్లో మాజీ మంత్రి వర్గీయులు 9 మంది, భాజపా రెబల్స్ ముగ్గురున్నారు. పార్టీ రెబెల్స్, ఎంఐఎం సభ్యులు, భాజపా రెబల్‌స్‌లో ఒకరిద్దరు మద్దతిచ్చే అవకాశముంది. మాజీ మంత్రి వర్గీయుల్లో ములస్తం లావణ్య, తోపారపు లావణ్య, ఎమ్మెల్యే వర్గీయుల్లో సమిండ్ల వాణి, అడువాల జ్యోతి ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో కొనసాగిన వారికే పదవి ఇవ్వాలని జీవన్‌రెడ్డి కోరుతుండటంతో లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రితో చర్చించి సీల్డ్ కవర్ తేనున్నారు. రెండు వర్గాల్లో ఒకరికి ఛైర్‌పర్సన్, మరొకరికి వైస్ ఛైర్మన్ పదవులు దక్కే అవకాశం ఉంది. నాలుగు కో ఆప్షన్ సభ్యుల్లో రెండు చొప్పున ఇవ్వనున్నట్లు సమాచారం.

**--ధర్మపురిలో ఏకపక్షం**

ధర్మపురిలో 15 వార్డులు కాంగ్రెస్ గెలుపొందగా జనరల్ మహిళకు రిజర్వ్ అయిన ఛైర్‌పర్సన్ స్థానాన్ని సంగనభట్ల సంతోషి, వేముల నాగలక్ష్మి ఆశిస్తున్నారు. కౌన్సిలర్లందరూ శిబిరానికి తరలివెళ్లగా అందరితో చర్చించి మంత్రి లక్ష్మణ్‌కుమార్ నిర్ణయం తీసుకోనున్నారు.

**--కోరుట్లలో నలుగురు ఆశావహులు**

కోరుట్లలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ వచ్చింది. ఛైర్‌పర్సన్ పదవిని అన్నం లావణ్య, పుప్పాల ఉమాదేవి, శీలం జయలక్ష్మి, తిరుమల వసంత ఆశిస్తుండగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు అందరితో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

**--మెట్‌పల్లిలో ఉత్కంఠ**

మెట్‌పల్లి బల్దియాలో భాజపాకు నలుగురు సభ్యులు తక్కువగా ఉండటంతో స్వతంత్రుల మద్దతుతో పదవి దక్కించుకోనున్నట్లు తెలిసింది. ఛైర్‌పర్సన్ పదవిని చెట్లపల్లి మీనా, ధర్మపురి స్వరూప ఆశిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్, భారాస చెరో పదవి తీసుకోనున్నట్లు ప్రచారంలో ఉంది. ఛైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్‌గా భారాసకు చెందిన సుధాకర్‌గౌడ్ కావచ్చని తెలుస్తోంది. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్నారు.

**--రాయికల్‌లో భారాస, కాంగ్రెస్ పొత్తు?**



రాయికల్‌లో భాజపా 5, కాంగ్రెస్, భారాస చెరో మూడు స్థానాలు గెలుచుకోగా కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. మొదట భాజపా, భారాస ఒకటి కావచ్చని భావించారు. చివరికి భారాస, కాంగ్రెస్ కలవనున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారాసకు చెందిన కట్కం రవీందర్‌ను ఛైర్మన్‌గా, తురగ సౌజన్యను వైస్ ఛైర్‌పర్సన్‌గా చేసేందుకు ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. భాజపా దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు భారాస అధిష్ఠానంతో చర్చించి పొత్తు కుదుర్చుకున్నట్లు సమాచారం.

**--ఎక్స్ అఫీషియో సభ్యులుగా ముగ్గురు**

పురపాలక సంఘాల్లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదుకు ఆదివారం వరకు అవకాశం ఉండగా జగిత్యాల బల్దియాలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆప్షన్లు ఇచ్చారు. కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ ఇదివరకే మెట్‌పల్లిలో ఆప్షన్ ఇచ్చారు. ధర్మపురిలో పోటీ లేకపోవడంతో మంత్రి లక్ష్మణ్‌కుమార్ ఎక్స్ అఫీషియో ఆప్షన్ ఇవ్వలేదు.

## పరిగి మున్సిపల్ పీఠంపై ఉత్కంఠ

# ..ఎక్స్‌అఫీషియో ఓటే కీలకం!

ఇటీవల వెల్లడైన ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెరో 8 స్థానాలను గెలుచుకున్నాయి. మరో రెండు వార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. వీరిలో అక్కమ్మ అనే స్వతంత్ర అభ్యర్థి బీఆర్ఎస్‌కు, మరో అభ్యర్థి హనుమంత్ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ పీఠం కోసం సోమవారం ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్స్‌అఫీషియో సభ్యుడి ఓటు కీలకంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌గౌడ్ ఈ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయన కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీకే పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశాలున్నాయి.

## జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ

# ..రంగంలోకి సీనియర్ నేతలు



ఈ కబురు, హైదరాబాద్:

జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. జగిత్యాల మున్సిపల్ పీఠంపై వారితో చర్చలు జరిపారు. జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు నేతలు ప్రయత్నం చేశారు. పార్టీలో ఆరంభం నుంచి ఉండి.. బలోపేతానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని జీవన్‌రెడ్డి కోరారు. తనవర్గానికి చెందిన వారికే ఛైర్మన్ పదవి ఇవ్వాలన్నారు. ''పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరాను. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. కట్టుబడి ఉంటాను. పార్టీ జెండా మోసిన వారికే పదవులు ఇవ్వాలని కోరుకునే వ్యక్తిని. నా అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పాను'' అని సమావేశం అనంతరం జీవన్‌రెడ్డి మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ బీఫారంపై గెలుపొందినవారు, స్వతంత్రులు, ఎంఐఎం కలిపి మొత్తం 23 మంది అభ్యర్థులతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

## చమురు కొనుగోళ్లు..

## రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవు: జైశంకర్



ఈ కబురు : వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చమురు దిగుమతులపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు పని చేయవన్నారు. అది జాతీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని.. భారత్ ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్నారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో జై శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు బదులిస్తూ.. భారత్ తన వ్యూహాత్మక ప్రయోజనాలకు కట్టుబడి ఉంటుందన్నారు. 'ఇంధన సమస్యల విషయానికొస్తే.. ప్రస్తుతం మార్కెట్ సంక్లిష్టంగా ఉంది. భారత్‌లోని చమురు కంపెనీలు యూరప్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను కూడా పరిశీలిస్తాయి. ఖర్చులు, నష్టాలు, లభ్యతను చూసి.. వారి ప్రయోజనాలకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటారు' అని అన్నారు. అమెరికాతో ఇటీవల ఇండియాకు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో భారత దిగుమతులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు ఆ దేశం కట్టుబడి ఉందంటూ అమెరికా ప్రకటించింది. ఈ విషయంలో భారత్ మాత్రం స్పందించలేదు. తాజాగా జై శంకర్ వ్యాఖ్యలతో యూఎస్‌కు సమాధానమిచ్చినట్లైంది.

## సామాన్యుల కోసమే 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ప్రధాని మోదీ



అనేక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**--వాణిజ్య ఒప్పందాలతో ప్రయోజనం..**

యూపీఏ ప్రభుత్వ హయాంలో వాణిజ్య చర్చలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. వారి ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేని కారణంగా విదేశాలతో విశ్వసనీయతతో కూడిన చర్చలు జరపలేక పోయారన్నారు. తద్వారా ఏ చర్చలనూ పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. తమ హయాంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, ఈయూ, అమెరికాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో ఎంఎస్ఎంఈలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా కార్మిక ఆధారిత రంగాలకు లబ్ధి చేకూరిందని, ఆయా దేశాలకు తక్కువ సుంకాలతోనే ఎగుమతులు చేసుకునే వీలు కలిగిందన్నారు.

**--రక్షణ రంగానికి పెద్దపీట..**

అంతర్జాతీయంగా భారత్ అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న దృష్ట్యా ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే తాజా బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.7.85లక్షల కోట్లు కేటాయించామన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల పథం సామాన్య పౌరులకు భారీ స్థాయిలో ప్రయోజనం చేకూరుస్తోందని చెప్పారు. రాబోయే దశాబ్దం పాటు నిర్మాణాత్మక సంస్కరణలు, లోతైన ఆవిష్కరణలు, పాలనను మరింత సరళీకరించడం.. ఈ మూడు ముఖ్యమైన సంస్కరణలనే ప్రధానంగా కొనసాగిస్తామన్నారు.

**--మహిళలే కీలకం..**

'వికసిత్ భారత్' సృష్టించడంలో మహిళలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారిని శక్తిమంతం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. అంతరిక్షం, స్టార్టప్ వంటి అనేక రంగాల్లో వీరు గొప్ప ప్రభావాన్ని చూపిస్తున్నారని గుర్తు చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్వల్పకాలిక ప్రజాదరణ పథకాల జోలికి వెళ్లలేదని.. ఉద్యోగాల కల్పన, సుస్థిరాభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కోసమే భారీగా కేటాయింపులు చేశామని అన్నారు.

## పేలుళ్ల కోసం 'అన్సార్ ఇంటీరియం'

# .. డాక్టర్ టెర్రర్‌లో మరో కోణం..!



ఈ కబురు : దిల్లీ ఉగ్రపేలుడు కేసులో తవ్వే కొద్దీ కొత్త కోణాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రడాక్టర్లు అందరూ కలిసి ఏకంగా 'అన్సార్ ఇంటీరియం' పేరిట కొత్త టెర్రరిస్టు సంస్థనే ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. వాస్తవానికి ఈ డాక్టర్లు మొత్తం చాలాకాలం క్రితమే ర్యాడికలైజ్ అయ్యారు. అప్పట్లో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ముజమ్మిల్ గన్నీ, ఉమర్ నబీ, ఆదిల్, ముజఫర్ మౌల్వీ ఇర్ఫాన్, కారీ ఆమిర్ , తౌఫిల్ గాజి కలిసి ఏప్రిల్ 2022లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారు. అదే సమయంలో వారు అన్సార్ ఇంటీరియం అనే సంస్థను ప్రారంభించారు. దీనికి ఆదిల్ చీఫ్‌గా నియమితులయ్యారు. మౌల్వీ ఇర్ఫాన్‌కు డిప్యూటీగా బాధ్యతలు అప్పగించారు. ఎవరెవరు ఏమి చేయాలనేది కూడా ముందే నిర్ణయించుకొని.. బాధ్యతలను పంచుకొన్నట్లు అరెస్టైన ఉగ్ర డాక్టర్లు వెల్లడించారు. వీరు ఆపరేషనల్ కోడ్స్ కూడా సిద్ధం చేసుకొన్నారు. ఉమర్ సమన్వయకర్త బాధ్యతలు తీసుకోగా..గన్నీ ఫైనాన్స్, కొనుగోళ్లు విభాగాలను చూసేవాడు. ఈ గ్రూప్ 2023లో పేలుళ్లకు అవసరమైన మెటీరియల్, ఎరువులను సోహ్నా నుంచి కొనుగోలు చేసింది. ఇక ఉమర్ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ కెమికల్ షాప్ నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. ఇక ఉమర్ ఆన్‌లైన్ వీడియోలు చూసి ఐఈడీలను తయారు చేయడం నేర్చుకొన్నట్లు ఇంటరాగేషన్‌లో తేలింది. ఆదిల్ దక్షిణ కశ్మీర్‌కు చెందిన డానిష్‌ను అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చి ఉంచాడు. అతనితో ఫిదాయిన్ దాడి చేయించాలని ఉమర్ యోచించాడు. కానీ, చివరి నిమిషంలో వెనక్కి తగ్గాడు. ఈ ఉగ్రడాక్టర్ల గ్రూపులో ఉమర్ అత్యధికంగా ర్యాడికలైజ్డ్ అయిన వ్యక్తి. దిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో లేదా.. ఏదైన కీలక ప్రార్థనా మందిరం వద్దగానీ అత్యంత శక్తిమంతమైన కారుబాంబును పేల్చాలని కుట్రపన్నినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. శ్రీనగర్ పోలీసులు ఈ సంస్థ గుట్టు రట్టు చేయడంతో.. ఉమర్ ఒక్కసారి తీవ్ర ఆందోళనలకు గురయ్యాడు. దీంతో దిల్లీలో పేలుడుకు పాల్పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఇతడు 2016, 2018లో ఉగ్ర సంస్థల్లో చేరేందుకు విఫల యత్నం చేసినట్టు సమాచారం.

## గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో

## వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



ఈ కబురు, బెంగళూరు: బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రపంచ ఆధ్యాత్మిక గురువు, ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. దేశ విదేశాల నుంచి విచ్చేసిన లక్షల మంది భక్తుల సమక్షంలో రుద్రాభిషేకం, ధ్యానం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షిక శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు చారిత్రక సోమనాథ జ్యోతిర్లింగ శకలాల దర్శన భాగ్యం కల్పించారు. ''భౌతిక ప్రపంచం నుంచి అతీంద్రియమైన ఆనందానికి మనసు చేరినప్పుడు మహాశివరాత్రి ఆవిష్కృతం అవుతుంది. ప్రతి కణంలోనూ శివుడు ఉంటాడు. మన చైతన్యం స్వభావమే శివుడు. శివునిలో లీనమవ్వడం భక్తి, ప్రతి ఒక్కరిలో శివుడిని చూడటం సేవ. మనకు ఈ పాటి విశ్వాసం ఉంటే చాలు.. ఆనందంగా ఉంటాం. ఇక జీవితంలో ఎలాంటి లోటు ఉండదు. ప్రేమ పూర్వకంగా శివరాత్రిలో పాల్గొంటే.. తమ కోరికలన్నీ ఏదో విధంగా నెరవేరుతాయని భక్తుల విశ్వాసం'' అని శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు.

**--తెలంగాణలోనూ సోమనాథ జ్యోతిర్లింగ శకలాల ప్రదర్శన**

క్రీ.శ.1026లో గజనీ మహమ్మద్ దాడులతో ధ్వంసమైన అసలు సోమనాథ్ జ్యోతిర్లింగపు అవశేషాలు ఇటీవల శ్రీశ్రీ రవిశంకర్ వద్దకు చేరాయి. వాటిని దర్శించుకునే అరుదైన అవకాశం శివరాత్రి వేడుకలకు హాజరైన భక్తులకు లభించింది. గురుదేవ్‌చే ఇవాళ పూజించిన సోమనాథ జ్యోతిర్లింగ శకలాలను మార్చి 21 నుంచి 28 వరకు తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో ప్రజల దర్శనార్థం తీసుకురానున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు తెలిపారు.

## గ్రహాంతర జీవులు ఉన్నాయి.. కానీ: ఒబామా



ఈ కబురు : అంతుచిక్కని రహస్యంగా మారిన గ్రహాంతరవాసులపై ఎన్నో ఊహాగానాలు వస్తుంటాయి. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువుల వంటి వాటితో అమెరికాలోని 'ఏరియా 51'కు బలమైన సంబంధాలున్నాయన్న ప్రచారమూ ఉంది. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను ఏరియా 51 (Area 51)లో అమెరికా నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని స్పష్టం చేశారు. దీనిని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు కూడా లేవన్నారు. దశాబ్దం క్రితం యూఎస్ ఎయిర్ ఫోర్స్ రీపర్ డ్రోన్లు సేకరించిన రాడార్ రికార్డింగ్‌లలో మధ్యప్రాచ్యంలోని కొన్ని ప్రాంతాలపై అసాధారణ జీవుల (Aliens) ఉనికి కనిపించిందని పలు నివేదికలు సూచిస్తుండడంపై ఒబామా స్పందించారు. గ్రహాంతర వాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధికారంలో ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు.

--ఏమిటీ ఏరియా 51?

అమెరికాలోని నెవాడలో ఉన్న 'ఏరియా 51' అత్యంత రహస్య ప్రాంతం. ఇక్కడ అమెరికా సైన్యం, శాస్త్రవేత్తలు ఆయుధాలు సహా పలు రకాల టెక్నాలజీలను పరీక్షిస్తారు. సైనిక శిక్షణ కూడా ఇస్తారు. ఈ స్థావరాన్ని 1955లో ఏర్పాటు చేశారు. నెవాడ ఎడారిలో 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇది ఉంది. ఇక్కడ గతంలో లాక్‌హీడ్ మార్టిన్ యూ2 నిఘా విమానాలను పరీక్షించారు. ఆ తర్వాత నుంచి పలు రహస్య ఫైటర్ జెట్ల పనితీరును ఇక్కడ అంచనా వేశారు. ఒకప్పుడు ఇక్కడ ఉపగ్రహ చిత్రాలు తీయడంపై నిషేధం ఉండేది. కానీ, ఇప్పుడు దానిని తొలగించారు.

# బ్యాంకులకు వరుస సెలవులు!




దేశంలోని వివిధ ప్రాంతాలలోని.. బ్యాంకు శాఖలు వచ్చే వారం మూడు రోజులు క్లోజ్‌లో ఉంటాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఫిబ్రవరి 18, 19, 20 తేదీలను సెలవు దినాలుగా ప్రకటించింది.
ఫిబ్రవరి 18 (బుధవారం): టిబెటన్ నూతన సంవత్సరమైన లోసర్‌ను జరుపుకుంటారు. కాబట్టి ఈ సందర్భంగా సిక్కింలోని బ్యాంకులకు సెలవు. ఫిబ్రవరి 19 (గురువారం): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మహారాష్ట్రలో బ్యాంకులకు సెలవు.
ఫిబ్రవరి 20 (శుక్రవారం): రాష్ట్ర దినోత్సవం/రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అరుణాచల్ ప్రదేశ్ & మిజోరాంలలో బ్యాంకులకు సెలవు.
అందుబాటులో ఆన్‌లైన్ సేవలు
బ్యాంకులకు వెళ్లి చేసుకోవాల్సిన ఏదైనా అత్యవసరమైన పనిని.. సెలవులను గమనించి ముందుగానే పూర్తి చేసుకోవాలి. బ్యాంకుల ఫిజికల్ బ్రాంచీలు మూసివేసినప్పటికీ నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ యాప్స్, ఏటీఎం విత్‌డ్రా వంటి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వినియోగదారులు చెల్లింపులు చేయడం, బ్యాలెన్స్ చెకింగ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌లు చేసుకోవచ్చు.

# పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్ట్.. 593 కిమీ రేంజ్!

టాటా మోటార్స్ ఫిబ్రవరి 20న.. భారతదేశంలో పంచ్ ఫేస్‌లిఫ్టెడ్ ఎలక్ట్రిక్ కారును పరిచయం చేయనుంది. అయితే ఈ కారు లాంచ్ కావడానికి ముందే.. టెస్టింగ్ సమయంలో కనిపించింది. ఇది ఎంత రేంజ్ ఇస్తుందనే విషయం కూడా లీక్ అయింది. ఈ కథనంలో ఆ వివరాలు చూసేద్దాం. టాటా పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్టెడ్ మోడల్ ఒక ఫుల్ ఛార్జ్‌పై 593.6కిమీ దూరం ప్రయాణిస్తుందని సమాచారం. దీన్నిబట్టి చూస్తే.. కారు చిన్నదే అయినా.. మంచి పర్ఫామెన్స్ ఇస్తుందని తెలుస్తోంది. దీని ధరలను కంపెనీ లాంచ్ సమయంలో వెల్లడించనుంది. టాటా పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్టెడ్ మోడల్ 25 కిలోవాట్, 35 కిలోవాట్ అనే రెండు బ్యాటరీ ప్యాక్‌లను పొందుతుంది. చిన్న బ్యాటరీ 82 హార్స్ పవర్, 114 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తే.. పెద్ద బ్యాటరీ 122 హార్స్ పవర్, 190 ఎన్ఎమ్ టార్క్ అందిస్తుంది. ఇది 45 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలో కూడా లభించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు.టాటా పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్ట్.. బంపర్ క్లీనర్ లేఅవుట్‌తో రీడిజైన్ చేయబడి ఉండటం చూడవచ్చు. వై షేప్ ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్లు ఉన్నాయి. ఛార్జింగ్ స్లాట్ అదే విధంగా ఉంటుంది. ఎయిర్ డ్యామ్ & స్కిడ్ ప్లేట్ కూడా కొంత అప్డేట్ అయ్యాయి. వెనుక వైపు.. ఫుల్ ఎల్ఈడీ లైట్ బార్ కనిపిస్తుంది.




# అంతరిక్షంలో డేటా సెంటర్లు

- భూమిపై చిన్న చెత్త ముక్క పడి ఉందనుకోండి. పెద్ద ప్రమాదమేమీ లేదు. కానీ, అంతరిక్షంలో పరిస్థితి వేరు. అక్కడ చిన్న శకలం వేగంగా దూసుకొచ్చి ఢీకొడితే పెను ప్రమాదమే సంభవిస్తుంది. రూ.వేల కోట్ల విలువైన ఉపగ్రహాలు, అంతరిక్ష యాత్రలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. అంతరిక్ష రంగాన్ని రక్షించుకునేందుకు ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి 16-20 వరకూ దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో భాగంగా కీలకమైన అంతరిక్ష రంగంపైనా చర్చ జరగనుంది.



**10 లక్షల వ్యర్థ శకలాలు..**
ప్రస్తుతం భూకక్ష్యలో సెంటీమీటరు, అంతకంటే పెద్ద పరిమాణంలో ఉన్న పది లక్షలకు పైగా వ్యర్థ శకలాలు (స్పేస్ డెబ్రిస్) తిరుగుతున్నాయి. వీటిని నిశితంగా గమనించకపోతే భారీ వ్యయంతో కూడిన అంతరిక్ష ప్రయోగాలు ప్రమాదంలో పడే అవకాశముంది. ఈ క్రమంలో భారతీయ స్పేస్ ఇంజినీర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు ఏఐ సాయంతో ఈ వ్యర్థాల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**గణాంకాల స్థానంలో ఏఐ**
'50 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహానికి ఏడాదిలో కనీసం 15 సార్లు ప్రమాద హెచ్చరికలు వస్తుంటాయి. అంతరిక్షంలో చురుగ్గా ఉన్న ఉపగ్రహాలు, పనిచేయనివి, విడిపోయిన శకలాలు, ఆఖరికి గ్రహ శకలాలనూ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం' అని దిగంతర ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిరుధ్ శర్మ తెలిపారు. సాధారణంగా ఉపగ్రహాలు, వ్యర్థాల గమనాన్ని అంచనా వేసేందుకు ఇప్పటివరకూ గణాంక నమూనాలను వాడుతున్నారు. వారం రోజుల తర్వాత ఒక వస్తువు ఎక్కడ ఉంటుందో కచ్చితంగా అంచనా వేసేందుకు, కక్ష్యలో మార్పులను గుర్తించేందుకు తాము ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్లు అనిరుధ్ వివరించారు. 'కక్ష్యలో రద్దీ పెరుగుతున్న వేళ, ఏఐ అనేది కేవలం ఒక అవసరం మాత్రమే కాదని, ఇది భద్రతకు అత్యవసరమని' ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ ఏకే భట్ స్పష్టం చేశారు.

**కచ్చితమైన సమాచారంతో..**
బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'పిక్సెల్ స్పేస్'.. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొంది. సంస్థ సీఈఓ అవైస్ అహ్మద్ మాట్లాడుతూ.. 'ఉపగ్రహాల నుంచి వచ్చే పెటాబైట్ల కొద్దీ డేటాను వ్యక్తులు విశ్లేషించడం అసాధ్యం. అందుకే, మేం ఏఐని వాడుతున్నామ'న్నారు. సరిహద్దు భద్రత, వ్యవసాయం, పంట దిగుబడి, ఇంధన లీకేజీలు, కాలుష్యం వంటి అంశాలపై మా ఏఐ మోడల్స్ కచ్చితమైన సమాచారాన్ని ఇస్తాయని తెలిపారు.

**స్వయంచాలకంగా...**
భవిష్యత్తులో ఉపగ్రహాలు తమకు తామే ప్రమాదాలను పసిగట్టి, ఢీకొనకుండా తప్పించుకునే 'అటానమస్ శాటిలైట్ ఆపరేషన్స్'పై దిగంతర దృష్టి సారించింది. వచ్చే అయిదేళ్లలో ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుందని అనిరుధ్ శర్మ వెల్లడించారు. ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ, ప్రమాదాల నుంచి బయటపడతాయని వివరించారు.
సుహోరా టెక్నాలజీస్ వంటి సంస్థలు మేఘాల అడ్డంకులు తొలగించి, స్పష్టమైన చిత్రాలను అందించేందుకు ఏఐ అల్గారిథమ్‌లను వాడుతున్నాయి. కేవలం జరిగిన విషయాన్ని చెప్పడమే కాకుండా, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అంచనా వేసే 'ప్రిడిక్టివ్ మోడల్స్'ను తాము అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ సీటీఓ రూపేష్ కుమార్ తెలిపారు.

- **రూ.150 కోట్ల పెట్టుబడితో 'జీఐఎస్ అండ్ ఏఐ కాంపిటెన్సీ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు ఎస్రీ ఇండియా ఎండీ అగేంద్ర కుమార్ తెలిపారు. ఇక్కడ డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు కలిసి సంక్లిష్టమైన సమాచారాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.**

**మూలం నుంచే పరిష్కరించేలా**
'అంతరిక్షాన్ని సురక్షితంగా, సుస్థిరంగా మార్చాలంటే సమస్యను కేవలం పర్యవేక్షిస్తే సరిపోదు. దాన్ని మూలాల నుంచే పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతరిక్షంలో ఒక వస్తువును గుర్తించి, దాని వద్దకు అత్యంత సమర్థమైన మార్గంలో చేరుకోవడానికి మేం ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నాం' అని అంటున్నారు ఇస్రో మాజీ శాస్త్రవేత్త, కాస్మోసర్వ్ స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ చిరంజీవి ఫణీంద్ర. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ అంతరిక్ష వ్యర్థాలను నేరుగా తొలగించే పరిష్కారాలను రూపొందిస్తోంది. కంప్యూటర్ సిములేషన్ల ద్వారా రూపొందించిన సింథటిక్ చిత్రాలు, ల్యాబ్‌లలో సేకరించిన వాస్తవ డేటాతో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు చిరంజీవి వెల్లడించారు. అంతరిక్షంలో వెలుతురు ఎప్పుడు ఎలా ఉంటుందో ఊహించలేం.. ఇలాంటి పరిస్థితుల్లోనూ వ్యర్థాల స్థానాన్ని, వాటి దశను కచ్చితత్వంతో గుర్తించడంలో మా ఏఐ సాంకేతికత పనిచేస్తుందని వివరించారు.

## గూగుల్ పే, ఫోన్‌పే ట్రాన్సాక్షన్.. రూ.1000 దాటితే ఫీజులా?

**దేశంలో యూపీఐ వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతి రోజూ లెక్కకు మించిన నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో రూ. 1000 కంటే ఎక్కువ మొత్తం యూపీఐ ద్వారా ట్రాన్సాక్షన్ చేస్తే సర్వీస్ ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఒక వార్త వైరల్ అవుతోంది. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది.**

**రూ.1000 కంటే ఎక్కువ ట్రాన్సాక్షన్ చేస్తే.. సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారనే వార్తలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) ఖండించింది. ప్రస్తుతం వ్యక్తుల మధ్య లేదా వ్యక్తులు - వ్యాపారాలు మధ్య జరిగే యూపీఐ లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని వెల్లడించింది. డిజిటల్ ఇండియా లక్ష్యాన్ని దెబ్బతీసే ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదు. ఇలాంటి వార్తలను ఎవరూ నమ్మొద్దని స్పష్టం చేసింది.**




**ఇదిలా ఉండగా.. 2026–27 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం UPI & RuPay డెబిట్ కార్డ్ లావాదేవీలకు మద్దతు ఇవ్వడానికి రూ. 2,000 కోట్లు కేటాయించింది. చిరు వ్యాపారులపై ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) భారం పడకుండా ఉండటానికి ఈ నిధులను కేటాయించనున్నారు. దీని ద్వారానే బ్యాంకులకు, పేమెంట్ అగ్రిగేటర్లకు ప్రోత్సాహకాలు ఇస్తోంది.**

**ప్రస్తుతం భారతదేశంలో చాలావరకు యూపీఐ లావాదేవీలే జరుగుతున్నాయి. నేడు చిన్న బట్టి కొట్టు నుంచి పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ వరకు దాదాపు అందరూ ఆన్లైన్ పేమెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు రోజుకు ఒక లక్ష రూపాయల వరకు పేమెంట్ చేసుకునే వెసులుబాటు ఉంది. బిజినెస్ అకౌంట్ అయితే రోజుకి రూ. 5 లక్షల వరకు ట్రాన్సాక్షన్ చేసుకోవచ్చు.**

## రూ.125 కోట్ల డీల్.. ఇక్సిగోకి మెజారిటీ వాటాలు




స్పెయిన్‌కి చెందిన ట్రెయిన్ బుకింగ్ ప్లాట్‌ఫాం అయిన ఆన్‌లైన్ ట్రావెల్ సొల్యూషన్స్ (ట్రెనెస్)లో మెజారిటీ వాటాలను ట్రావెల్ అగ్రిగేటర్ ఇక్సిగో కొనుగోలు చేయనుంది. 60 శాతం వాటాల కొనుగోలు ప్రతిపాదనకు సంస్థ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ డీల్ విలువ సుమారు రూ. 125 కోట్లుగా (11.70 మిలియన్ యూరోలు) ఉంటుంది.యూరోపియన్ ఓటీఏ మార్కెట్లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. మరోవైపు స్క్వాడ్ యాజ్ సరీవస్ అనే ఇంకో స్పానిష్ సంస్థలో కూడా 45.02 శాతం వాటాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కూడా ఇక్సిగో బోర్డు ఆమోదం తెలిపింది. దీని విలువ రూ. 4.83 కోట్లుగా ఉంటుంది. ఎస్క్యూఏఏఎస్ సంస్థ ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సంబంధ సేవలను అంది

# ఆర్థిక భవిష్యత్తు: బంగారం కొనాలా.. వద్దా?

కొన్ని రోజులకు ముందు భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు మెల్లగా తగ్గుముఖం పడుతున్నాయి. రేట్లు పెరుగుతున్నప్పుడు.. ఏ ధరకైనా కొనేయాలని ఎగబడిన కొంతమంది జనం.. ఇప్పుడు తగ్గుతున్నాయి కదా అని వేచి చూస్తున్నారు. ఇంకా తగ్గే అవకాశం ఉందేమో అని ఆలోచిస్తున్నారని ప్రముఖ ఇన్వెస్టర్, మార్కెట్ మాస్ట్రోలో డైరెక్టర్ 'అంకిత్ యాదవ్' తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.
ధరలు పెరిగినప్పుడు ఉత్సాహం చూపించారని, రేటు తగ్గుతున్నప్పుడు ప్రజలు మౌనం పాటిస్తున్నారని అన్నారు. ఇది మార్కెట్‌లో సహజమైన అంశం. అయితే ఇది పూర్తి స్థాయి క్రాష్ అని నిర్ధారించలేము. ఇదొక స్లోడౌన్ దశ మాత్రమే.
వెండి ధర భవిష్యత్తులో 100 డాలర్లు లేదా 120 డాలర్ల వరకు వెళ్లే అవకాశం ఉంది. దీనికి ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, డాలర్ బలహీనత, ద్రవ్యోల్బణం వంటి అంశాలు ప్రధాన కారణమవుతాయి. ప్రపంచం మొత్తం.. ప్రస్తుతం భారీ రుణభారంతో ఉంది. ముఖ్యంగా అమెరికా అప్పులు మళ్లీ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఫెడరల్ రిజర్వ్‌కు (Fed) అందుబాటులో ఉన్న ఎంపికలు చాలా తక్కువ. ఇలాంటి సమయంలో వారు ఎక్కువ లిక్విడిటీ అందించడం, అంటే మరింత డబ్బు ముద్రించడానికి సిద్ధపడే అవకాశం ఉంది. ఇదే జరిగితే డాలర్ విలువ బలహీనపడే అవకాశం ఉంటుంది. డాలర్ విలువ ఎప్పుడైతే పడిపోతుందో.. బంగారం, వెండి ధరలు అమాంతం పెరుగుతాయి. కాబట్టి ఇప్పటికే బంగారం లేదా వెండి కలిగి ఉన్నవాళ్లు దాన్ని నిల్వ చేసుకోండి. ఇది మీ ఆర్థిక భవిష్యత్తుకు చాలా ఉపయోగపడుతుంది.
ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే కొత్తగా గోల్డ్, సిల్వర్ కొనాలనుకుంటే.. తప్పకుండా ఓసారి ఆలోచించాల్సిందే. ఎందుకంటే.. ప్రస్తుతం ధరలు చౌకగా లేవు. ఎప్పుడైనా ఎక్కువ ధర వద్ద పెట్టుబడి పెట్టడం వల్ల మూలధన నష్టం వచ్చే ప్రమాదం ఉంటుంది. కాబట్టి త్వరగా ధనవంతులు కావాలని తొందరపడకూడదు. కొంత ఓపిగ్గా ఎదురు చూడండి అని.. అంకిత్ యాదవ్ వివరించారు.



## నాకు వర్షంలా.. సంతోశ్‌కి కపుల్ ఫ్రెండ్లీ: ప్రభాస్

'కపుల్ ఫ్రెండ్లీ' అందమైన ప్రేమకథా చిత్రమని కథానాయకుడు ప్రభాస్ ప్రశంసించారు. తనకు 'వర్షం' సినిమాలా.. సంతోశ్‌కి ఇది గుర్తుండిపోయే చిత్రమవుతుందని చెప్పారు. సంతోశ్ శోభన్ - మానస వారణాసి జంటగా నటించిన ఈ సినిమాని అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి. అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ఇది తాజాగా థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. ఈ సినిమా చూడటాన్ని తాను చాలా ఎంజాయ్ చేశానని తెలిపారు. సంతోశ్ - మానస జోడీ అద్భుతంగా ఉందని.. అశ్విన్ ఎంతో గొప్పగా తెరకెక్కించారని ప్రశంసించారు. ఇలాంటి మంచి కథల్ని తెరపైకి తీసుకొచ్చిన నిర్మాత అజయ్‌కు.. యూవీ క్రియేషన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక హైదరాబాద్‌లో ఈ చిత్ర సక్సెస్‌మీట్‌లో హీరో సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "వాలెంటైన్ డే సీజన్‌లో వచ్చిన పర్ఫెక్ట్ ప్రేమకథా చిత్రమిది. దీన్ని ప్రభాస్ చూసి.. ప్రశంసించడం నేను గెలిచానన్న అనుభూతిని కలిగించింది" అన్నారు. ఈ కార్యక్రమంలో మానస, ధీరజ్ మొగిలినేని, అశ్విన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.






# బాలీవుడ్ నటికి బెదిరింపులు.

బాలీవుడ్ ప్రముఖులకు వరుసగా బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా నటి, గాయకురాలు హిమాన్షీ ఖురానా (Himanshi Khurana)కు బెదింపులు వచ్చాయి. రూ.10 కోట్లు ఇవ్వాలంటూ ఓ దుండగుడు డిమాండ్ చేశాడు. ఈ మేరకు మొహాలీ పోలీసులకు నటి ఫిర్యాదు చేశారు. ఈమెయిల్ ద్వారా వాయిస్ నోట్ వచ్చిందని.. అడిగింది ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. జీషన్ అక్తర్ అనే పేరుతో మెయిల్ వచ్చినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పంజాబీ మూవీ 'సద్దా హక్'తో హిమాన్షీ నటిగా మంచి గుర్తింపు పొందారు. 'జోడీ బిగ్‌డే పార్టీ', 'నా.. నా.. నా' లాంటి ఆల్బమ్స్‌తో అలరించిన ఆమె.. హిందీ 'బిగ్‌బాస్' సీజన్ 13లో సందడి చేశారు.

బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్‌శెట్టి (Rohit Shetty), హీరో రణ్‌వీర్‌సింగ్ (Ranveer Singh)కు ఇటీవల బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి వీరిద్దరికీ వాట్సప్‌లో వాయిస్ నోట్ పంపాడు. తన డిమాండ్‌లను అంగీకరించకపోతే.. వారి సిబ్బందిని హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు.





## అల్లు వారి పెళ్లిసందడి.. తొలి శుభలేఖ చిరంజీవికే.

అల్లు వారి ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేశారు. ఈ క్రమంలో పెళ్లి పిలుపులు షురూ చేశారు. తొలి శుభలేఖను అల్లు శిరీష్.. తన మావయ్య, అగ్ర కథానాయకుడు చిరంజీవికి అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. అల్లు అరవింద్ సతీ సమేతంగా చిరు దంపతులకు నూతన వస్త్రాలు అందించి పెళ్లికి ఆహ్వానించారు. అల్లు శిరీష్‌కు తన ప్రియురాలు నయనికతో గతేడాది అక్టోబర్‌లో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. మార్చి 6న వీరి వివాహం జరగనుంది. (Allu Sirish Wedding Date). అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం.

శిరీష్-నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్- లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థ్యాంక్స్" అని చెప్పారు.

## 'జన నాయగన్' విడుదల మరింత ఆలస్యం?: డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రకటనతో చర్చ



ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ (Vijay) హీరోగా నటించిన చిత్రం 'జన నాయగన్' (Jana Nayagan). ఈ సినిమాని సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీకి పంపిన నేపథ్యంలో.. మార్చిలో విడుదలయ్యే అవకాశాలున్నాయని ప్రచారం జరిగింది. కానీ, ఏప్రిల్‌లోనూ ఈ చిత్రం బాక్సాఫీసు ముందుకు రాదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. కెనడాలో భారతీయ సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసే సంస్థ 'యార్క్ సినిమాస్' విడుదల చేసిన ప్రకటనే ఇందుకు కారణం.
''జన నాయగన్' ఏప్రిల్ 30 లోపు విడుదల కాదన్న విషయాన్ని గమనించగలరు'' అని ప్రస్తావించిన సదరు సంస్థ.. ఈ సినిమా టికెట్లు బుక్ చేసుకుని, ఇంకా రిఫండ్ పొందని వారు సంబంధిత థియేటర్ల యాజమాన్యాలను సంప్రదించొచ్చు అని పేర్కొంది. కొత్త విడుదల తేదీ ఖరారైన తర్వాత ప్రాధాన్యతను బట్టి బుకింగ్ చేసుకునే వీలుంటుందని తెలిపింది. దీంతో, మేలో విడుదల ఉండొచ్చని కొందరు అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, తమిళనాడు శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రిలీజ్ మరింత ఆలస్యం కానుందనే టాక్ వినిపిస్తోంది. 'యార్క్ సినిమాస్' ప్రకటనపై చిత్ర బృందం నుంచి ఎలాంటి స్పందన లేదు. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జనవరి 9న విడుదల కావాల్సి ఉంది. సెన్సార్ బోర్డు వద్ద సమస్య తలెత్తగా.. ఆ వివాదం తొలుత మద్రాస్ హైకోర్టుకు, తర్వాత సుప్రీంకోర్టుకూ చేరిన సంగతి తెలిసిందే. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. కోర్టులో పలు వాదనల అనంతరం.. సెన్సార్ బోర్డుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను నిర్మాతలు కొన్ని రోజుల క్రితం ఉపసంహరించుకున్నారు. సినిమాని రివైజింగ్ కమిటీకి పంపించారు.

## బుచ్చిబాబుకు చరణ్ విషెస్.. ఫొటో పంచుకున్న హీరో



రామ్‌చరణ్ (Ram Charan) హీరోగా దర్శకుడు బుచ్చిబాబు 'పెద్ది' (Peddi) సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ డైరెక్టర్ (Buchi Babu)కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయనతో కలిసి దిగిన ఫొటో పంచుకున్నారు చరణ్. ''పెద్ది' కెప్టెన్ బుచ్చిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. సినిమాపై మీకున్న అమితాసక్తి, క్షుణ్ణంగా కథను చెప్పే విధానం సెట్స్‌లో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంటాయి. మనం మరిన్ని మ్యాజికల్ స్టోరీస్ క్రియేట్ చేద్దాం. ఈ ఏడాది.. మీ కష్టానికి తగిన గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా'' అని చరణ్ పేర్కొన్నారు. దీనిపై బుచ్చిబాబు స్పందిస్తూ.. థాంక్స్ చెప్పారు. ఈ సినిమా ప్రయాణంలో.. చరణ్ నుంచి తాను రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటున్నానని అన్నారు. ఎడిట్ రూమ్‌లో సినిమాని చూసినప్పుడల్లా రామ్‌చరణ్ నటన తనను కట్టిపడేస్తోందని పేర్కొన్నారు. పెద్ది క్యారెక్టర్ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుందన్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీ కపూర్ హీరోయిన్. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఏప్రిల్ 30న బాక్సాఫీసు ముందుకు రానుంది. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రమిదే.

## 'వరల్డ్ ఆఫ్ నాగబంధం' వీడియో పంచుకున్న మహేశ్ బాబు




సూపర్ స్టార్ మహేశ్ బాబు మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా ఓ ఆసక్తికరమైన కొత్త సినిమా టీజర్‌పై ప్రశంసలు కురిపించారు. 'నాగబంధం' పేరుతో వస్తున్న ఈ సినిమా టీజర్‌ను తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. "'ది వరల్డ్ ఆఫ్ నాగబంధం' అద్భుతంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది. త్వరలో దీన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ మహేశ్ బాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్ ఇండియా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.
విడుదలైన టీజర్‌ను బట్టి ఇది భారతీయ పురాణాలు, చరిత్ర నేపథ్యంతో కూడిన భారీ యాక్షన్ ఎపిక్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. సంభాషణలు లేకుండా కేవలం విజువల్స్‌తోనే కథను చెప్పే ప్రయత్నం ఆకట్టుకుంటోంది. భారీ యుద్ధ సన్నివేశాలు, రహస్యమైన పాత్రలతో టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ముఖ్యంగా నటుడు విరాట్ కర్ణ విభిన్న రూపాల్లో ఇంటెన్స్‌గా కనిపించారు.
మహాశివరాత్రి రోజున ఈ మైథలాజికల్ యాక్షన్ టీజర్‌ను విడుదల చేయడం, దానికి మహేశ్ బాబు ప్రశంసలు తోడవడంతో సోషల్ మీడియాలో మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రం 2026 వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# టీ20 ప్రపంచకప్: నేపాల్ ఇంటికి.. వెస్టిండీస్ సూపర్ 8కు..



ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు హ్యాట్రిక్ విజయాలతో సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్‌సిలో భాగంగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్.. 20 ఓవర్లలో 133/8 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన విండీస్ జట్టు.. 15.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. కెప్టెన్ షై హోప్ (61*: 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెట్‌మయర్ (46*: 32 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టారు. బ్రాండన్ కింగ్ (22) పరుగులు చేశాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమితో నేపాల్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# తిలక్ వర్మపై గంభీర్ సీరియస్



**టీ20 ప్రపంచకప్-2026లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తిలక్ వర్మ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తొలి ఓవర్‌లోనే అభిషేక్ శర్మ ఔట్ కావడంతో క్రీజులోకి వచ్చిన తిలక్ తన జిడ్డు బ్యాటింగ్‌తో విసిగించాడు. ఓ వైపు ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడుతుంటే తిలక్ మాత్రం నెమ్మదిగా ఆడుతూ హెడ్‌కోచ్ గంభీర్ అగ్రహానికి గురయ్యాడు.**

డ్రింక్స్ బ్రేక్ సమయంలో డగౌట్ నుంచి బయటకు వచ్చిన గంభీర్, తిలక్ వర్మతో చాలా సీరియస్‌గా మాట్లాడాడు. వేగంగా ఆడాలని, టార్గెట్ 170 దాటాలని గంభీర్ గట్టిగా చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా ఈ మ్యాచ్‌లో పాక్ స్పిన్నర్లను ఎదుర్కొవడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు. మొత్తంగా 24 బంతుల్లో 104.17 స్ట్రైక్ రేటుతో 25 పరుగులు చేసి ఔటయ్యాడు.

# వణికించిన పసికూన!.. పట్టలేనంత ఆనందం: హ్యారీ బ్రూక్



టీ20 ప్రపంచకప్2026 టోర్నమెంట్లో ఇప్పటికే రెండు సంచలనాలు నమోదయ్యాయి. టోర్నీకి తొలిసారి అర్హత సాధించిన ఇటలీ.. మూడోసారి వరల్‌డ్‌కప్ ఆడుతున్న నేపాల్‌ను ఓడించింది. ఇక మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాకు పసికూన జింబాబ్వే షాకిచ్చింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చాంపియన్ జట్టును ఓడించింది.

ఇక తాజాగా గ్రూప్‌సిలో భాగంగా ఇంగ్లండ్‌కు పసికూన స్కాట్లాండ్ చెమటలు పట్టించింది. నేపాల్‌తో మ్యాచ్‌లో ఎలాగోలా గట్టెక్కిన బ్రూక్ బృందం.. స్కాటిష్ జట్టుపైనా అదే రీతిలో గెలిచి ఊపిరి పీల్చుకుంది. తద్వారా సూపర్ 8 ఆశలను సజీవం చేసుకుంది.

**ఈరోజు కూడా గెలుపు గీత దాటేశాము**

ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (Harry Brook) తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన టామ్ బాంటన్ (Tom Banton)ను ప్రశంసించాడు. అదే విధంగా జోఫ్రా ఆర్చర్ (Jofra Archer) సైతం మరోసారి అద్భుతంగా బౌలింగ్ చేశాడని కొనియాడాడు. "ఈరోజు కూడా మేము గెలుపు గీతను దాటేశాము. పట్టలేనంత సంతోషం. మా స్పిన్ బౌలింగ్‌లో స్కాట్లాండ్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఆ సమయంలో వారు మాకంటే ముందంజలో నిలిచారు. అయితే, మేము తిరిగి పుంజుకున్నాం. ఆర్చర్ తన మ్యాజిక్ చూపించాడు.

**జాగ్రత్తగానే ఉంటాము**

ఇక లక్ష్య ఛేదనలో బాంటన్ అద్భుతం చేశాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి గొప్పగా ఆడాడు. కోల్‌కతా వికెట్ బాగుంది. సామ్ కర్రాన్ సైతం కాసేపు మెరుపులు మెరిపించాడు. మా చివరి మ్యాచ్‌లో ఇటలీతో తలపడతాం. వాళ్లతో జాగ్రత్తగానే ఉంటాము'' అని హ్యారీ బ్రూక్ చెప్పుకొచ్చాడు. కాగా కోల్‌కతా వేదికగా శనివారం ఇంగ్లండ్ స్కాట్లాండ్ తలపడ్డాయి.

**వణికించిన పసికూన**

ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఇంగ్లండ్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (32 బంతుల్లో 49; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మైకేల్ జోన్స్ (20 బంతుల్లో 33; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు రషీద్ (3/36), ఆర్చర్ (2/24), డాసన్ (2/34) స్కాట్లాండ్ బ్యాటర్ల పనిపట్టారు.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 18.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి గెలిచింది. ఆరంభమైన తొలి ఓవర్లో సాల్ట్ (2), రెండో ఓవర్లో బట్లర్ (3)... ఇలా ఇద్దరు మేటి హిట్టర్లను 13 పరుగులకే కోల్పోయింది. ఈ దశలో బెథెల్ (28 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), బాంటన్ ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు.

**గెలిపించిన బాంటన్**

అయితే జట్టు స్కోరు 79 వద్ద బెథెల్, కాసేపటికే కెప్టెన్ బ్రూక్ (4) వికెట్లు పారేసుకోవడంతో మళ్లీ 86/4 స్కోరు వద్ద ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. దీంతో జట్టును గెలిపించే బాధ్యతను పూర్తిగా తన భుజాన వేసుకున్న టామ్ బాంటన్ (41 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో గెలిపించాడు.

బాంటన్‌కు తోడు సామ్ కరన్ (20 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు), జాక్స్ (16 నాటౌట్)లు రాణించారు. ఫలితంగా ఇంకో 10 బంతులు మిగిలుండగానే ఇంగ్లండ్ ఐదు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మెక్‌ములెన్, క్యూరి, వీల్, లీస్క్ తలా ఒక వికెట్ తీశారు. ఇదిలా ఉంటే.. ఇంగ్లండ్ తమ రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన సంగతి తెలిసిందే.

# పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్...




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన హైవోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 61 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈరోజు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గ్రూప్‌ఏలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. తద్వారా టోర్నమెంట్‌లో సూపర్ 8 దశకు అధికారికంగా అర్హత సాధించింది.

176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆది నుంచే తడబడింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఒక దశలో 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఉస్మాన్ ఖాన్ (44) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. అయితే, అతడు ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. భారత బౌలర్లు మూకుమ్మడిగా రాణించడంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌట్ అయింది. హార్దిక్, బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తిలక్ వర్మ (25), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) నుంచి మంచి సహకారం లభించింది. అయితే, మిడిల్ ఓవర్లలో హార్దిక్ పాండ్య (0) విఫలమవడంతో స్కోరు వేగం తగ్గింది. చివర్లో శివమ్ దూబే (17 బంతుల్లో 27), రింకు సింగ్ (4 బంతుల్లో 11) వేగంగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు.

ఇక, భారత్ గ్రూప్‌ఏలో తన చివరి లీగ్ మ్యాచ్‌ను నెదర్లాండ్స్ తో ఈ నెల 18న అహ్మదాబాద్ లో ఆడనుంది.

## వరల్డ్ కప్ నుంచి నమీబియా ఔట్..

# యూఎస్ఏకు రెండో విజయం

**చెన్నై: టీ20 ప్రపంచ కప్ నుంచి నమీబియా నిష్క్రమించింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓటమితో సూపర్ - 8 రేసు నుంచి బయటకు వెళ్లిపోయింది. యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో 31 పరుగుల తేడాతో నమీబియా పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఎస్ఏ 199/4 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో నమీబియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులే చేయగలిగింది. లౌరెన్ (58) హాఫ్ సెంచరీ.. జాన్ నికోల్ (28), జేజే స్మిత్ (31*) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. యూఎస్ఏ బౌలర్లలో షాడ్లీ 2.. అలీ ఖాన్, శుభమ్ రంజనె, సౌరభ్ నేత్రావల్కర్ తలో వికెట్ తీశారు.**

**తొలుత బ్యాటింగ్‌లో..**

**టాస్ నెగ్గిన అమెరికా బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (52), సంజయ్ కృష్ణమూర్తి (68*) హాఫ్ సెంచరీలు చేయడంతో.. అమెరికా 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. మిలింద్ కుమార్ (28), షయన్ జహంగీర్ (22), సాయితేజ ముక్కామల్ల (17) ఫర్వాలేదనిపించారు. నమీబియా బౌలర్లలో విలెమ్ 2, ఎరాస్మస్ 2 వికెట్లు పడగొట్టారు.**




## ఆసీస్ గడ్డపై జూలు విదిల్చిన టీమిండియా..

# తొలి టీ20లో ఘన విజయం




**2026 ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 15) జరిగిన తొలి టీ20లో టీమిండియా 21 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ వద్ధతిలో) గెలుపొందింది.**

ఈ మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లు జూలు విదిల్చారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్‌ను 133 పరుగులకే (18 ఓవర్లలో) కుప్పకూల్చారు. పేసర్లు రేణుకా సింగ్ (4114 2), అరుంధతి రెడ్డి (40224), క్రాంతి గౌడ్ (30390) నిప్పులు చెరిగే బంతులతో ఆసీస్ ప్లేయర్ల భరతం పట్టారు. స్పిన్నర్లు శ్రీ చరణి (30142), దీప్తి శర్మ (20191) కూడా సత్తా చాటారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ (20 240) ఒక్కరే కాస్త ధారాళంగా పరుగులు సమర్పించుకుంది.

ఆసీస్ ఇన్నింగ్స్‌లో జార్జియా వేర్హామ్ (30) టాప్ స్కోరర్ కాగా.. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (26), ఎల్లిస్ పెర్రీ (20), జార్జియా వాల్ (18), నికోలా క్యారీ (12) రెండంకెల స్కోర్లు చేశారు. బెత్ మూనీ (5), ఆష్లే గార్‌డ్‌నర్ (4), అన్నాబెల్ సదర్ల్యాండ్ (3), కిమ్ గార్త్ (2), డార్సీ బ్రౌన్ (1) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. కొత్త కెప్టెన్ సోఫీ మోలినెక్స్ 6 పరుగులతో అజేయంగా నిలిచింది.

అనంతరం భారత్ లక్ష్య ఛేదనకు దిగిన సమయంలో వరుణుడు పలు మార్పులు ఆటంకం కలిగించాడు. జట్టు స్కోర్ 501 (5.1 ఓవర్లలో) వద్ద ఉండగా.. భారీ వర్షం ప్రారంభమై, ఎంతకీ తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన భారత్‌ను విజేతగా ప్రకటించారు. స్వల్ప లక్ష్య ఛేదనలో షఫాలీ వర్మ (11 బంతుల్లో 21; ఫోర్, 2 సిక్సర్లు) సహజ శైలిలో విరుచుకుపడింది. మ్యాచ్ ఆగిపోయే సమయానికి స్మృతి మంధన (16), జెమీమా రోడ్రిగ్స్ (9) క్రీజ్‌లో ఉన్నారు. షఫాలీ వికెట్ మోలినెక్స్‌కు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో టీ20 ఫిబ్రవరి 19న కాన్‌బెర్రా వేదికగా జరుగనుంది.

